# బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయడం ఖాయం



మోండా డివిజన్ బండిమెట్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**● మోండా డివిజన్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా మంత్రి తలసాని**

మారేడ్‌పల్లి, అక్టోబర్ 19 : సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్‌లో పాదయాత్ర ద్వారా ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ప్రచారం మోండా డివిజన్‌లోని బండిమెంట్, మారుతివీధి, నాలాబజార్, ఓల్డ్ జైల్‌ఖానా తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బతుకమ్మలు, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. స్థానిక మహిళలు మంగళ హారతులు ఇచ్చి మంత్రికి బ్రహ్మరథం పట్టారు. అదేవిధంగా అపార్ట్‌మెంట్‌ల పై నుంచి మహిళలు, యువత మంత్రిపై పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు బస్తీ, కాలనీల్లో అభివృద్ధి చేసి, తమ బతుకుల్లో వెలుగులు నింపిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని బస్తీ వాసులు తెలిపారు. పాదయాత్ర ప్రచారంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజల్ లకు చెందిన కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధిని 10 సంవత్సరాల కాలంలో చేశానన్నారు. గతంలో ఇక్కడి నుంచి గెలుపొంది ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, మంత్రులుగా చేసిన వారు సైతం చేయలేని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సహకారంతో కోట్ల రూపాయాల నిధులు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. గతంలో బస్తీ, కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు అస్థవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన తరువాత పాత డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌ను తొలగించి.. నూతన పైప్‌లైను వేసి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. సనత్‌నగర్‌లో తాను చేసిన అభివృద్ధి ప్రస్తుతం కండ్ల ముందు కనబడుతుందని తెలిపారు. ముమ్మాటికి గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు చూపెడుతున్న ఆదరణ చూస్తుంటే భారీ మెజార్టీతో ఘన విజయం ఖాయమని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, నామన శేషు కుమారి, కిరణ్మయి, డివిజన్ పార్టీ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, కొలన్ బాల్‌రెడ్డి, గుర్రం పవన్ కుమార్, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకు లుతలసానని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, జయరాజ్, ఓదెల సత్యనారాయణ, సంతోష్, కరుణాకర్‌రెడ్డి, మహేశ్, మహేందర్ పాల్గొన్నారు.



మోండా డివిజన్‌లో మంగళ హారతులతో మంత్రి తలసానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

**ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ప్రజలు గుర్తుకు వస్తారు..**

ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలకు ప్రజలు గుర్తుకు వస్తారని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్‌లో పాదయాత్ర ద్వారా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం (మొదటి రోజు) ప్రచారం మోండా డివిజన్‌లోని బండిమెంట్, మారుతివీధి, నాలాబజార్, ఓల్డ్ జైల్‌ఖానా తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలోనే దేశంలోనే బీఆర్‌ఎస్ ముందుందని అన్నారు. మాయ మాటలతో ప్రజల వద్దకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మబోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 45 నుంచి 50 సంవత్సరాల పార్టీ అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వమని అడగడం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికారంలో ఉన్ననాడే ప్రజలకు మేలు చేయలేని వారు.. ఇప్పుడు గ్యారెంటీ, వారంటీలు అంటూ వస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రాష్ట్ర బీజేపీ నేతలు ఎన్ని నిధులు తీసుకోచ్చారో చెప్పాలని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, మూడో సారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం పక్కా అని చెప్పారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో కోట్ల రూపాయాల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 50 సంవత్సరాల కాలంలో ఏవరూ చేయని అభివృద్ధి పనులు 10 సంవత్సరాల కాలంలో తాను చేశానని వెల్లడించారు.

## అన్ని సంస్కృతులకు ప్రభుత్వం పెద్దపీట



పటేదార్ భవన్‌లో జరిగిన దసరా వేడుకల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్ : దసరా నవరాత్రుల్లో భాగంగా సనత్‌నగర్ నీమ్‌కర్‌నగర్‌లోని పటేదార్ భవన్‌లో జరుగుతున్న వేడుకలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపుతో హైదరాబాద్ అలరారుతోందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పటేదార్ సమాజం బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, అమీర్‌పేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రాజ్‌పురోహిత్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు హనుమంతరావు, గులాబ్‌సింగ్‌తో పాటు గుజరాతి సమాజం ప్రతినిధులు హన్స్‌రాజ్ పటేల్, చైన్‌సింగ్, మోహన్ పటేల్ పాల్గొన్నారు.

## టీఎస్‌పీసీబీలో బతుకమ్మ వేడుకలు



తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పీసీబీ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో సభ్యకార్యదర్శి కృష్ణ ఆదిత్య పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఉద్యోగినులు తెలంగాణ సంప్రదాయానికి అద్దం పట్టేలా ఇక్కడి ఆవరణలో ఆడిపాడిన బతుకమ్మ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో టీఎస్‌పీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ట్ బి.రఘుతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **– అమీర్‌పేట్, అక్టోబర్ 19**


## భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

అమీర్‌పేట్, అక్టోబర్ 19 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఎర్రగడ్డలోని టిమ్స్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికుల కోసం అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో దాదాపు 500 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు, అక్కడి సైట్ అధికారులు, సిబ్బందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ వైద్యురాలు డాక్టర్ సమీర మాట్లాడుతూ.. నిరంతరం కాలుష్యంతో కూడిన వాతావరణంలో పని చేస్తుండే భవన నిర్మాణ కార్మికులు నియమిత కాలంలో తమ వైద్య పరీక్షలు ఖచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. నిర్మాణాలు జరుగుతుండే సమయాల్లో చోటు చేసుకునే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## డివిజన్‌లో జరిగిన అభివృద్ధి ఓటర్లకు వివరించాలి

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 19 : ఓటర్లను కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి వారి మద్దతు కోరాలని పద్మారావునగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం పద్మారావునగర్ బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల జాబితాను అందరికీ అందజేశామని అన్నారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పేర్లు ఉన్నాయో లేవో చూసుకోవాలని ఆయన సూచించారు. బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలలో ప్రతి ఇంటికీ వెళ్ళి ఓటర్లను కలవాలని ఆయన కోరారు. దసరా పండుగ తరువాత పద్మారావునగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాదయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శి ఎం.మహేందర్, నాయకులు ఏసూరి మహేశ్వర రావు, శ్రీకాంత్‌రెడ్డి, గజ్జెల శ్రీను, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మంత్రి తలసాని విజయానికి ఎంఐఎం సహకారం



సనత్‌నగర్‌లో సమావేశమైన ఎంఐఎం నాయకులు

అమీర్‌పేట్, అక్టోబర్ 19 : సనత్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజయానికి బీఆర్‌ఎస్ పార్టీ మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం తన పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఆ పార్టీ సనత్‌నగర్ అధ్యక్షుడడు మహ్మద్ షౌకత్ పేర్కొన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి విజయానికి అందించాల్సిన చేయూతపై గురువారం సనత్‌నగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో పార్టీ నాయకులు చర్చించారు. ఈ సమావేశం అనంతరం నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి నిర్వహించిన సమావేశం సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేపట్టిన అభివృద్ధితో నియోజకవర్గ రూపురేఖలే మారిపోయాయన్నారు. ఏకకాలంలో నియోజకవర్గం అభివృద్ధితో పాటు సామాన్యుల సంక్షేమానికి పెద్దపట వేసిన మంత్రి తలసాని ఘనతకు ఇంటింటా వివరించే కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ ఎంఐఎం అధ్యక్షులు పి.జె.అశోక్‌తో పాటు మహ్మద్ అక్రమ్, అబద్దుల్ ఖయ్యూమ్, హనీఫ్, ఎం.ఎ.ఇర్ఫాన్, షకీల్ బేగ్, మహ్మద్ వసీమ్, సయ్యద్ ఇషాఖ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

అమీర్‌పేట్/ బన్సీలాల్‌పేట్/బేగంపేట్, అక్టోబర్ 19 : న్యూబోయిగూడ ఐడిహెచ్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించారు. వేద పండితుల సమక్షంలో గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాన నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆయన తొలిపూజ నిర్వహించారు. తాము అడగ్గానే తన స్వంత నిధులతో పురాతన ఆలయం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన మంత్రి తలసానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయి తరుణ్ చిన్న, ఉపాధ్యక్షుడు భరత్, మహేందర్, శివకుమార్ ఆయనకు ధన్యవాదములు తెలిపారు. బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, నాయకులు ఏసూరి మహేశ్వర రావు, గజ్జెలశ్రీను, శివకుమార్ పాల్గొన్నారు.

**మల్లికార్జునస్వామి ఆలయంలో చండీ హోమం..**

భోలక్‌పూర్‌లోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో గురువారం గణపతి, చండీ హోమం, గోపుర పూజ, అన్నదానం నిర్వహించారు. ఈ పూజలకు బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే హేమలత, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ పవన్‌కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు కే లక్ష్మిపతి, ఆలయ కమిటీ చైర్మన్ జి.శ్రీరాములు, సభ్యులు పాల్గొన్నారు.



గజలక్ష్మిదేవిగా దర్శనమిచ్చిన మహంకాళి అమ్మవారు

**న్యూబోయిగూడలో దేవీనవరాత్రి ఉత్సవాలు..**

న్యూబోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలో పార్థి యూత్ అసోసియేన్ ఆధ్వర్యంలో 30వ వార్షిక శ్రీ దేవీనవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. గురువారం అమ్మవారిని కీర్తిస్తూ జాగరణ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు హాజరయ్యారు. ముఖ్య నిర్వాహకులు కామ్‌రాజ్, హామ్‌రాజ్, శివకుమార్, రాజు, సాయి, మధు, చిన్న, కపిల్ పాల్గొన్నారు.

**శ్రీ గజలక్ష్మీదేవిగా ఉజ్జయిని మహంకాళి..**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా గురువారం రోజున ఉజ్జయినిమహంకాళి అమ్మవారు శ్రీ గజలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శినమిచ్చారు. ఆలయ మండపంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని పూజలు చేశారు.